క్లుప్తంగా

ఓటు వేయడం నైతిక బాధ్యత

పార్వతీపురం: ఓటు వేయడం మన నైతిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిజాయతీగా ఓటు వేయాలని, భవిష్యత్‌ను నిర్ణయించే ఈ ఎన్నికల్లో యువత ఓటు వేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంతో పోలింగ్ బూత్‌లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

ముగిసిన ప్రచార పర్వం

- మూగబోయిన మైకులు
- మూతపడ్డ మద్యం దుకాణాలు
- పోలింగ్ ఏర్పాట్లతో నిమగ్నమైన అధికారులు



పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌ఓ విష్ణుచరణ్

సాలూరు: సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. గత నెల రోజులుగా పట్టణం, పల్లెల్లో ఆయా పార్టీల ప్రచార హోరు మూగబోయింది. మద్యం దుకాణాలు మూసివేశారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు స్థానిక నాయకులు తమదైన శైలిలో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. నియోజకవర్గంలో 2,01,441 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 98,189 మంది కాగా, 1,03,248 మంది మహిళలు, 4 ఇతరులు ఉన్నారు. సాలూరు మున్సిపాలిటీలో 40,928, సాలూరు మండలం పరిధిలో 44,048 మంది, పాచిపెంట మండల పరిధిలో 36634 మంది, మెంటాడ మండలంలో 38,086, మక్కువ మండలంలో 41,745 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఏర్పాట్లను ఐటీడీఏ పీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ పర్యవేక్షించారు. 243 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



మంచాడవలస వద్ద మద్యం దుకాణాన్ని మూసివేస్తున్న సిబ్బంది

నిండు మనసుతో ఆశీర్వదించండి



సాలూరు: ఎన్నికల ప్రచార ర్యాలీలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాజన్నదొర

- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ పాలనను కొనసాగిద్దాం..
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర
- వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

మక్కువ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి సంక్షేమ పాలన అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర కోరారు. మండల కేంద్రంలో మావుడి సోదరుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రచార ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ముందుగా స్థానిక మజ్జిగౌరమ్మ ఆలయంలో రాజన్నదొర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ నుంచి మక్కువ ప్రధాన రహదారి, మార్కెట్ రోడ్డు, దేవాంగులవీధి, బ్రాహ్మణవీధి, పెంట్రీడ్డివీధి, గాంధీనగర్ వీధుల మీదుగా పద్మశ్రీ థియేటర్ వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన ప్రచార సభలో రాజన్నదొర మాట్లాడుతూ.. జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితే ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగడంతో పాటు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మన పిల్లల భవిష్యత్ బాగుంటుందన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబునాయుడు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు మళ్లీ అవే హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ బూటకపు హామీలు నమ్మి మోసపోవద్దని కోరారు. సీఎం జగన్‌ను ఎదుర్కొనేందుకు కూటమి నేతలంతా ఒక్కటయ్యారని, కానీ జగనన్నకు తోడుగా రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఉన్నాయన్నారు. ప్రచారానికి చివరి రోజు కావడంతో భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీల నుంచి వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. జై జగన్, జై రాజన్నదొర నినాదాలతో మక్కువ మార్మోగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ, బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, డీసీసీబీ డైరెక్టర్ మావుడి తిరుపతినాయుడు, ఎంపీపీ మర్రి పారమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పూడి దాలినాయుడు, పెంట సంజీవునాయుడు, తేలు శ్రీరాములునాయుడు, బలగ చంద్రశేఖరరావు, కొయ్యాన మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాసంక్షేమ సువర్ణయుగ పాలన కొనసాగాలంటే ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర కోరారు. పట్టణంలోని 18,19 వార్డుల్లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు, మహిళలు పూలదండలతో రాజన్నదొరకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మంచి సేసింది జగన్‌మోహన్‌రెడ్డి అయితే, మోసం చేసింది చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజారాణిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గిరి రఘు, పువ్వల శ్రీను, చొక్కాపు గోపి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సాలూరు: 17వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర



సాలూరు: రాజన్నదొరకు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



మక్కువ: జై జగన్, జై రాజన్న నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



మక్కువ: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి రాజన్నదొర



మక్కువ: మజ్జిగౌరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న పీడిక రాజన్నదొర

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన ఇప్పలవలస యువతతో జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి ఆకర్షితులై టీడీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. సీతానగరం మండలం ఇప్పలవలసకు నుంచి టీడీపీకి చెందిన 30 కుటుంబాలు శనివారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి జోగారావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతుగా..



సీతానగరం: సుంకరివీధిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ గౌరి, మాజీ సర్పంచ్ ఎల్.లక్ష్మి

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రంతో తెరపడింది. చివరి రోజు కావడంతో ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించారు. పార్వతీపురం, సాలూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఏవిధంగా మోసం చేశారో గుర్తుచేశారు. కూటమి హామీలు బూటకమి, వాటిని నమ్మి మోసపోవద్దని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



సీతానగరం: కృష్ణారాయపురంలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతానగరం: గెద్దలుప్పిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



పార్వతీపురం: పట్టణంలోని 27వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు



పాచిపెంట: కేసలి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్న ఎంపీపీ బద్నాన ప్రమీల

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రజా మద్దతుతో మళ్లీ గెలిచి నిలిచేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని కృష్ణపల్లి పంచాయతీ బండిదొరవలస, గంగాపురం పంచాయతీ ఇందూపురం, పెద్దబొండపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతంపైగా నెరవేర్చారన్నారు. నవరత్న పథకాలతో పేదల జీవితాల్లో సంతోషాలు నింపారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే సోమవారం నాడు జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.

- ఫ్యాన్ జోరులో కూటమి కొట్టుకుపోవడం ఖాయం
- చివరి రోజు ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు
- జన సంద్రమైన పార్వతీపురం పట్టణం

పార్వతీపురంటౌన్/పార్వతీపురం:

ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవుతారని, సంక్షేమ పాలన కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు ఆశాభావం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి చివరిరోజు కావడంతో శనివారం పార్వతీపురం పట్టణంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి స్థానిక వైఎస్సార్ కూడలి నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. దారి పొడవునా ప్రజలు ఆయనపై పూలవర్షం కురిపించారు. జై జగన్, జై జోగారావు అంటూ నినాదలు చేశారు. అనంతరం అక్కడ నిర్వహించిన సభలో జోగారావు మాట్లాడుతూ.. రేపు జరిగే ఎన్నికల్లో రాష్ట్రమంతటా ఫ్యాన్ గాలి వీయడం ఖాయమని, ఆ గాలికి కూటమి పార్టీలన్నీ కొట్టుకుపోతాయని అన్నారు. ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యేగా తాను, అరుకు ఎంపీగా తనూజారాణి ఎన్నిక తథ్యమన్నారు.



ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న జన సమూహంలో ఓ భాగం

నియోజకవర్గంలో రూ.1540 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

ఐదేళ్లలో పార్వతీపురం నియోజకవర్గంలో రూ.1540 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు అన్నారు. నియోజకవర్గంలో 2లక్షల 28వేల మందికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయరంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ వారి పేరిట అనేక సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితే సంక్షేమం, అభివృద్ధి రెంట్టింపు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గుణేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బండితోరవలసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జోగారావు



ఇందూపురం ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న జోగారావు

కె.గలావల్లిలో..
అభివృద్ధి వెలుగులు

- కోట్లాది రూపాయలతో మౌలిక వసతుల కల్పన
- అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికీ సంక్షేమ లబ్ధి



బలిజిపేట మండలంలోని కె.గలావల్లి గ్రామం



ఇంటింటికీ వేసిన తాగునీటి కుళాయిలు



గ్రామంలో నిర్మించిన వాటర్ ట్యాంక్

బలిజిపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారుమూల పల్లెలకు సైతం అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చేరాయి. గత ప్రభుత్వంలో మూరుమూల గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉండగా.. నేడు సకల సౌకర్యాలతో ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో పేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు ప్రసరించాయి. మండలంలోని గలావల్లి పంచాయతీ పరిధిలోని కుగ్రామమైన కె.గలావల్లిలో రూ.1.05 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామంలో 170 కుటుంబాలు నివాసం ఉండగా.. ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాల కింద లక్షలాది రూపాయల లబ్ధి చేకూరింది. వలంటీర్ల ద్వారా అర్హులకు నేరుగా పథకాలు అందుతున్నాయి. గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణంతో పాటు గ్రామంలోని వీధుల్లో సీసీరోడ్లు, కాలువలు నిర్మించారు. నాడు–నేడు నిధులతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసి ప్రతిరోజు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేస్తుండడంతో తాగునీటి కష్టాలు తీరిపోయాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమంతో సంతృప్తి



ఈ ప్రభుత్వంలో పేదలకు ఎటువంటి ఆంక్షలు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని వ్యాధులకు ఉచితంగా వైద్యం అందుతోంది. వైద్య ఖర్చు పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేదలకు వైద్యానికి ప్రభుత్వం భరోసా ఇచ్చింది. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరవేస్తోంది.

– ఇందుమతి, కె.గలావల్లి గ్రామం, బలిజిపేట మండలం

అర్హులకు సంక్షేమ పథకాలు



కుటుంబంలో ఎంతమంది అర్హులు ఉంటే అందరికీ నేరుగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న ప్రభుత్వం ఇది. ప్రజా సంక్షేమంతో ప్రజలకు చేరువయింది. ఎవరి వద్దకు వెళ్లకుండా, ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా అర్హతను బట్టి నేరుగా పథకాలు అందిస్తున్నారు.

– తవుడమ్మ, కె.గలావల్లి గ్రామం, బలిజిపేట మండలం